క్లుప్తంగా

'పోశిన'కు డాక్టర్ గూడూరి పరామర్శ



అన్నదేవరపేటలో పోశిన శ్రీకృష్ణదేవరాయలుతో మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

తాళ్లపూడి: ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలు ఫ్రాక్చర్ కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొంది, ప్రస్తుతం అన్నదేవరపేటలోని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పోశిన శ్రీకృష్ణదేవరాయలును ఆదివారం ఆ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాల గురించి డాక్టర్ శ్రీనివాస్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు తోట రామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

బాలదుర్గమ్మ గుడిలో తులాభారం



ఆలయంలో చిన్నారిని పటికబెల్లంతో తులాభారం వేస్తున్న కుటుంబ సభ్యులు

దేవరపల్లి: స్థానిక బాలదుర్గమ్మ ఆలయంలో ఆదివారం చిన్నారికి తులాభారం వేశారు. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురానికి చెందిన బల్లే సాయికృష్ణ, నాగవెంకట సత్యశ్రీ దంపతుల కుమార్తె గీతిక వెంకట వైభవిని పటికబెల్లంతో తులాభారం వేసి మొక్కు తీర్చుకున్నారు. ఇప్పటి వరకూ 634 తులాభారాలు జరిగినట్టు ఆలయ కమిటీ ప్రతినిధి కామిశెట్టి దుర్గారావు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సుందరేశ్వరునికి లక్షపత్రి పూజ



శివ లింగానికి అభిషేకం చేస్తున్న పురోహితులు

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు.ఉదయం గణపతి పూజ, స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్షపత్రి పూజ చేశారు. శ్రీ సూక్త విధానంలో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని సుందరంగా అలంకరించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.లక్షపత్రి పూజా కమిటీ అధ్యక్షుడు అనుపిండి చక్రధరరావు, ఆలయ అర్చకులు మానేపల్లి శ్రీనివాస శాస్త్రి, సుందర గణేశ్‌లతో పాటు పమ్మి రవిబాబు, తెన్నేటి సూర్యనారాయణ మూర్తి, కలిగొట్ల కృష్ణారావు, అత్తిలి చల్లారావు, కందుకూరి లక్ష్మీనరసింహశాస్త్రి ,వైవీఎస్ కామేశ్వరరావు, పుల్లే సత్యనారాయణ, బళ్లమూడి సత్యనారాయణమూర్తి, లంక రాధాకృష్ణ తదితర పండితులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొవ్వూరు: అనారోగ్యంతో బాధపడుతూ, ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఐ.పంగిడికి చెందిన చౌటుపల్లి సురేష్ (27) రెండు నెలలుగా కామెర్ల వ్యాధితో బాధ పడుతున్నారు. తనకు కడుపునొప్పి వచ్చిందని, మందులు తెచ్చుకుంటానని తల్లితో చెప్పి ఈనెల 26న సురేష్ బయటకు వెళ్లారు. కొంతసేపటి తర్వాత అతడు గ్రామ శివార్లలోని రంగారావు కాలనీ సమీపంలో పడి ఉండడాన్ని స్థానికులు గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు ప్రాథమికంగా గుర్తించినట్టు కొవ్వూరు రూరల్ పోలీసులు తెలిపారు. సురేష్‌ను తొలుత కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఈనెల 27న కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సురేష్ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. సురేష్ తల్లి సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు రూరల్ హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

2 నుంచి చదరంగం పోటీలు

ప్రకాశం నగర్ : జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 2వ తేదీ నుంచి అండర్-9 బాలుర, బాలికల విభాగంలో స్థానిక శ్రీగౌతమి స్మార్ట్ స్కూల్‌లో జిల్లా చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2015 జనవరి 1 తర్వాత జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులని తెలిపారు.

కొలువు కొనసాగేనా.. ఊడేనా?

- ఆందోళన చెందుతున్న మద్యం దుకాణాల ఉద్యోగులు
- అక్టోబర్ 1 నుంచి నూతన పాలసీ
- ఉద్యోగుల భవిష్యత్తు అగమ్యగోచరం
- షాపుల కోసం కూటమి నేతల యత్నాలు



ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ చాగల్లు మద్యం డిపో వద్ద అధికారులకు వినతి పత్రం ఇస్తున్న ఉద్యోగులు(ఫైల్)



నిడదవోలు టౌన్‌లో ఓ షాపు వద్ద మద్యం విక్రయాలు

నిడదవోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బంది ఉపాధి ఊగిసలాటలో పడింది. నూతన మద్యం పాలసీని అక్టోబర్ 1 నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. మెరుగైన మద్యం పాలసీని రూపొందిస్తున్నామని, ధరలను కూడా తగ్గిస్తున్నామంటూ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సమాచారంతో ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో మొత్తం 44 మద్యం దుకాణాలు ఉన్నాయి. వాటిలో నిడదవోలు, కొవ్వూరు పట్టణాల పరిధిలోని ఒక్కో షాపులో ఒక సూపర్‌వైజర్, ముగ్గురు సేల్స్‌మెన్లు, ఒక వాచ్‌మన్ చొప్పున విధులు నిర్వహిస్తున్నారు. ఇక మండలాల్లోని ఒక్కో షాపులో ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్‌మెన్లు, ఒక వాచ్‌మన్ చొప్పున పని చేస్తున్నారు. ఈ లెక్కన డివిజన్ వ్యాప్తంగా మొత్తం 174 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వారిలో సూపర్‌వైజర్‌కు నెలకు రూ.19 వేలు, సేల్స్‌మన్‌కు రూ.16,500, వాచ్‌మన్లకు రూ.12 వేల చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో 21 ప్రభుత్వ మద్యం దుకాణాలున్నాయి. కొవ్వూరు నియోజకవర్గంలో 15, గోపాలపురం నియోజకవర్గంలో 18 దుకాణాలు ఉన్నాయి.

జగనన్న ఉద్యోగాలిస్తే బాబు తీసేస్తున్నారు

2019కు ముందు నడిచిన మద్యం దుకాణాలకు ప్రతి రెండేళ్లకోసారి టెండర్లు పిలిచేవారు. లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయించేవారు. మహిళలు సైతం టెండర్లలో పాల్గొనేవారు. కొన్ని ముఖ్యమైన సెంటర్లలో మద్యం దుకాణాలకు డిమాండ్ ఎక్కువగా ఉండేది. అయితే అవన్నీ రాజకీయ నాయకుల కనుసన్నల్లోనే నడిచేవి. టీడీపీ ప్రభుత్వంలో మద్యం దుకాణాల నిర్వహణలో పలు అక్రమాలు కూడా జరిగేవి. తెలుగు తమ్ముళ్లు వెనక ఉండి యథేచ్ఛగా బెల్ట్ షాపులు నడిపించే వారు. వాటి నియంత్రణకు, ప్రైవేట్ దోపిడీని అరికట్టేందుకు 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సర్కారీ మద్యం దుకాణాలకు శ్రీకారం చుట్టింది. అవినీతికి చెక్ పెట్టింది. ప్రభుత్వ మద్యం షాపుల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పలువురు అర్హులకు ఉద్యోగాలు ఇచ్చింది. సూపర్‌వైజర్, సేల్స్‌మన్, నైట్ వాచ్‌మన్ తదితర ఉద్యోగాలు క్రియేట్ చేసి ఒక్కో షాపులో నలుగురి నుంచి ఐదుగురికి ఉద్యోగాలు కల్పించింది. దాదాపు ఐదేళ్ల పాటు వారంతా మద్యం దుకాణాల్లో పని చేస్తూ తమ కుటుంబాలను నిశ్చింతగా పోషించుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని అమల్లోకి తెస్తుండడంతో వారి ఉద్యోగాలు ప్రశ్నార్థకంగా మారాయి.

వినతి పత్రం అందజేత

నిడదవోలు నియోజకవర్గంలోని 21 మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సూపర్‌వైజర్లు ఇటీవల చాగల్లులోని మద్యం డిపో వద్ద ఆందోళన చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ దుకాణాల్లో పనిచేస్తూ ఐదేళ్లు ఉపాధి పొందామని వారు పేర్కొన్నారు. ఉద్యోగాల నుంచి తొలగించి, తమ కడుపులు కొట్టొద్దని కోరుతూ డిపో అధికారులకు వారు వినతిపత్రం అందజేశారు.

కూటమి తమ్ముళ్లకే పెద్ద పీట

కూటమి ప్రభుత్వ నూతన మద్యం పాలసీని నిశితంగా పరిశీలిస్తే ప్రైవేట్ ఏజెన్సీలే మద్యం షాపులను నిర్వహించే పరిస్థితి కనిపిస్తోంది. ఇందుకోసం టెండర్ల ప్రక్రియ కూడా కొనసాగుతోంది. నూతన మద్యం పాలసీతో అంతిమంగా లబ్ధి పొందేది కాంట్రాక్టర్లు, టీడీపీ, జనసేన నేతలే అనేది బహిరంగ రహస్యమే. నూతన మద్యం పాలసీ పేరుతో ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రభుత్వ దుకాణాలను తొలగిస్తారు. ఆ స్థానంలో అక్టోబర్ 1 నుంచి గత టీడీపీ పాలనలో మాదిరిగా ప్రైవేట్ మద్యం దుకాణాలు వెలుస్తాయి. దీంతో ఈ మద్యం షాపులను దక్కించుకోవడానికి ఇప్పటికే కూటమి నేతలు పావులు కదుపుతున్నారు. గతంలో లక్కీడిప్ ద్వారా షాపులు కేటాయించేవారు. ఇప్పుడూ ఇదే పద్ధతిలో కేటాయిస్తారా? లేదా? అనేది తేలాల్సి ఉంది. ఇక ప్రస్తుతం ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేస్తున్న సిబ్బందిని కొనసాగిస్తారా లేక తొలగిస్తారా, అనే విషయంపై ఇప్పటికీ స్పష్టత లేదు. దాంతో షాపుల్లో పనిచేస్తున్న వారి ఉద్యోగాలు ఉంటాయా? లేక తొలగిస్తారా? అన్నది తేలడం లేదు. దాంతో తమ ఉపాధిపై ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి షాపులు వెళితే తమకు కావాల్సిన వారిని షాపుల్లో నియమించుకుంటారనే భావనతో ప్రస్తుత ఉద్యోగులు ఉన్నారు. ఒకవేళ తమను విధుల నుంచి తొలగిస్తే ఆందోళన బాట పట్టక తప్పదని వారు స్పష్టం చేస్తున్నారు.

4న నిడదవోలు మండల సమావేశం

నిడదవోలు రూరల్: నిడదవోలు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని అక్టోబర్ 4వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పి.శామ్యూల్ ఆదివారం తెలిపారు. సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

మలకపల్లిలో నేత్రదానం

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లికి చెందిన చెరుకూరి రాజ్యలక్ష్మి (65) ఆదివారం మృతి చెందగా ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. తాళ్లపూడి మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యులు రాజ్యలక్ష్మి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు తరలించినట్టు లయన్స్ చార్టర్ అధ్యక్షుడు మారిన రామ్మూర్తి తెలిపారు.

కొవ్వూరులో గోపూజ

కొవ్వూరు: బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో స్థానిక గోష్పాద క్షేత్రంలోని సుందర గోవిందుడి ఆలయంలో ఆదివారం గోపూజ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం సుందర గోవిందుడ్ని దర్శించుకున్నారు. తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ చేసిన వ్యక్తులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిడమర్తి సత్యకుమార్, ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ, మాట్లా ఆంజనేయులు, తాడిమళ్ల విజయవాణి, బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు, చెరుకూరి సాయిరాజు, గంద్రోతు పవన్ తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గొయ్యి.. ఆదమరిస్తే ముప్పు



వర్షాలకు గుంతలు పడి అధ్వానంగా తయారైన దేవరపల్లి - పల్లంట్ల రోడ్డు



యర్నగూడెం-యాదవోలు రోడ్డు దుస్థితి

- వర్షాలకు దెబ్బతిన్న గ్రామీణ రహదారులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలోని పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఈ రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. వర్షాలకు గోతుల్లో నీరు చేరడం వల్ల గోతుల లోతు తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.రెండు నెలలుగా ఎడతెరిపి లేకుండా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రహదారులు దెబ్బతిన్నాయి. దేవరపల్లి మండలంలోని పలు రహదారులు దారుణంగా ఉన్నాయి. ప్రధానంగా దేవరపల్లి-పల్లంట్ల రోడ్డు, పొంగుటూరు-త్యాజంపూడి రోడ్డు, లక్ష్మీపురం-పల్లంట్ల, పల్లంట్ల-కురుకూరు, గోపాలపురం మెయిన్ రోడ్డు నుంచి బందపురం మీదుగా దుద్దుకూరు (జీడీ) రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి, త్వరితగతిన పనులు పూర్తి చేసి, ప్రమాదాల నుంచి కాపాడాలని ప్రయాణికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎండకు ఎండుతూ... వానకు తడుస్తూ

పాఠశాలల్లో సైకిల్ షెడ్లు లేక విద్యార్థులకు అవస్థలు



చాగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో షెడ్డులేక ఎండలో పార్క్‌చేసిన విద్యార్థుల సైకిళ్లు



మార్కొండపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

చాగల్లు: మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సైకిల్ షెడ్లు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. చాగల్లు, ఊనగట్ల హైస్కూళ్లలో దాతల సహకారంతో షెడ్లు నిర్మించారు. కాని చాగల్లు, మల్లవరం, మార్కొండపాడు, బ్రాహ్మణగూడెం, కలవలపల్లి హైస్కూళ్లలో మాత్రం సైకిల్ షెడ్లు లేవు. ఈ ఐదు పాఠశాలల్లో సుమారు మూడు వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో సగానికి పైగా విద్యార్థులకు సైకిళ్లు ఉన్నాయి. ఈ పాఠశాలలకు సమీప గ్రామాల నుంచి విద్యార్థులు సైకిళ్లపైనే వస్తుంటారు. అయితే విద్యార్థులు పాఠశాలలకు వేసుకు వచ్చిన సైకిళ్లను భద్రపరిచేందుకు షెడ్లు లేకపోవడంతో ఆరుబయట ఎండలోనే ఉంచుతున్నారు. సైకిళ్ల పార్కింగ్ చేసుకోవడానికి సరైన వసతి లేకపోవడంతో అవి ఎండకు ఎండుతూ తరచూ ట్యూబులకు పంక్చర్లు పడుతున్నాయి. ఇక వర్షాకాలంలో అయితే వానకు తడిసి పాడవుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. సమస్యను గతంలో విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు, దాతలు స్పందించి పాఠశాలల ఆవరణల్లో సైకిల్ షెడ్లు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు.

దేవరపల్లిలో దాహం.. దాహం

- గ్రామస్తులకు తొలగని మంచినీటి కష్టాలు
- పనులు పూర్తయినా సరఫరా కాని వైనం
- ట్యాంకు వద్దకు వెళ్లి టిన్నులతో తెచ్చుకుంటున్న ప్రజలు



దేవరపల్లి-యాదవోలు రోడ్డులో ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద మంచినీరు పట్టుకుంటున్న ప్రజలు

దేవరపల్లి: రేపోమాపో నగర పంచాయతీ స్థాయికి చేరుకోబోతున్న దేవరపల్లిని తాగునీటి సమస్య వెంటాడుతోంది. మంచినీటి కష్టాలు తీరేదెప్పుడని ప్రజలు పాలకులను ప్రశ్నిస్తున్నారు. దేవరపల్లి గ్రామ పంచాయతీ జనాభా సుమారు 16 వేలు. గోపాలపురం నియోజకవర్గంలోనే అత్యధిక జనాభా గల పంచాయతీగా దేవరపల్లి గుర్తింపు పొందింది. అయినప్పటికీ ఏళ్ల తరబడి ఇక్కడ మంచినీటి సమస్య ప్రజలను పట్టి పీడిస్తోంది. ప్రధానంగా శివారు కాలనీలకు మంచినీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు దప్పికతో అలమటిస్తున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దాదాపు పది బోర్లు ఉన్నప్పటికీ వాటిలో మూడు మాత్రమే తాగునీటికి ఉపయోగపడుతున్నాయి. మిగిలిన బోర్ల ద్వారా వచ్చే నీటిలో ఫ్లోరైడ్ (సుద్ద) శాతం అధికంగా ఉండడంతో తాగడానికి అక్కరకు రావడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

మినరల్ వాటరే దిక్కు..

మరో గత్యంతరం లేక దేవరపల్లిలోని ధనిక, మధ్యతరగతి ప్రజలు గ్రామంలోని మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచి టిన్నుల ద్వారా మంచినీరు తెచ్చుకుని దాహం తీర్చుకుంటున్నారు. పేదలు మాత్రమే బోర్ల నుంచి వచ్చే సుద్దనీటినే తాగి వ్యాధులతో బాధపడుతున్నారు. బుచ్చియపాలెం రోడ్డులోని రెండు బోర్ల నుంచి సరఫరా అవుతున్న నీరు గ్రామంలోని కొంత ప్రాంతానికి మాత్రమే సరఫరా అవుతోంది. అలాగే యాదవోలు రోడ్డులోని బోరు నుంచి యాదవోలు రోడ్డు, నిమ్మలపాటి వీధి ప్రాంతాలకు సరఫరా అవుతుంది. ఈ మూడు బోర్ల ద్వారా సరఫరా అవుతున్న నీరు గ్రామంలోని దాదాపు 50 శాతం ప్రజలకు మాత్రమే అందుతోంది. ఈ నీటిని ప్రజలు జల ప్రసాదంగా వినియోగిస్తున్నారు. కీళ్ల నొప్పులు, ఒంటి నొప్పులతో బాధపడుతున్న ప్రజలు టిన్నులు తీసుకుని బోర్ల వద్దకు వెళ్లి రాత్రి సమయంలో తెచ్చుకుంటున్నారు. ఇక యాదవోలు రోడ్డులోని ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి ఎక్కువ మంది నీటిని టిన్నులతో తెచ్చుకోవలసి వస్తోంది. ట్యాంకు వద్ద రాత్రి 11 గంటల వరకూ ప్రజలు నిలబడి నీరు పట్టుకుంటున్నారు. ట్యాంకు వద్ద కనీసం వీధి లైటు కూడా లేకపోవడంతో ముళ్లపొదల మధ్య నీరు పట్టుకోవలసి వస్తోందని వాపోతున్నారు. దాదాపు 15 ఏళ్లుగా గ్రామంలో ఇదే పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆ రెండు కాలనీలకూ..

గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఇందిరమ్మ, చంద్రబాబు నాయుడు కాలనీలు ఉన్నాయి. ఒక్కొక్క కాలనీలో సుమారు 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. రెండు కాలనీల ప్రజలకు మంచినీటి సమస్య ఎక్కువగా ఉంది. ప్రజల మంచినీటి కష్టాలను తెలుసుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఏడాది క్రితం జల్ జీవన్ మిషన్ పథకంలో అప్పటి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సుమారు రూ.30 లక్షల వ్యయంతో చంద్రబాబు నాయుడు కాలనీ, థియేటర్ ప్రాంతానికి పైపులైన్ వేయించారు. బోరు, మోటారు ఏర్పాటుకు ఎంపీపీ కేవీకే దుర్గారావు మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేశారు. బోరు, మోటారు ఏర్పాటు చేసి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకూ మంచినీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గ్రామీణ మంచినీటి సరఫరా అధికారి శ్రీనివాసరావును వివరణ అడగగా విద్యుత్ సర్వీస్ ఇవ్వనందున మోటారు పనిచేయడం లేదన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ శాఖకు గ్రామ పంచాయతీ ఇటీవల రూ.3 లక్షలు చెల్లించిందని, విద్యుత్ సర్వీసు ఇచ్చిన వెంటనే మంచి నీరు సరఫరా చేస్తామని ఆయన తెలిపారు.



దేవరపల్లి-యాదవోలు రోడ్డులో ఆరు నెలల క్రితం వేసిన బోరు

రాజమహేంద్రవరంలో 3కే రన్

సీటీఆర్ఐ: ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం 3కే రన్ నిర్వహించారు. వెంకటేశ్వరనగర్‌లోని జవహర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ నేతృత్వంలో వాకర్స్ అందరికీ గుండె జబ్బులపై అవగాహన కల్పించేందుకు 3 కే రన్ నిర్వహించారు.

ముగిసిన మెగా వైద్య శిబిరం

1,268 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో రోగికి పరీక్షలు చేస్తున్న గుండె వైద్య నిపుణుడు సుమంత్

దేవరపల్లి: ఆదివారం ప్రపంచ గుండె ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవరపల్లిలోని సుమంత్స్ ఆసుపత్రి వద్ద మూడు రోజులు నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. స్థానిక డాక్టర్ సుమంత్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, రాజమహేంద్రవరం బొల్లినేని హాస్పిటల్, జోదా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ కె.సుమంత్ పర్యవేక్షణలో వివిధ విభాగాలకు చెందిన 15 మంది వైద్య నిపుణులు, సిబ్బంది ఈ శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పిల్లలకు కూడా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. దేవరపల్లి పరిసర ప్రాంతాల్లోని సుమారు 60 గ్రామాల నుంచి 1,268 మంది రోగులు శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ గుండె వైద్య నిపుణుడు సుమంత్ మాట్లాడుతూ శిబిరంలో ప్రధానంగా గుండె సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించామన్నారు. గత మూడేళ్లుగా ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించి, పేద రోగులకు సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. డాక్టర్ శరత్ చంద్రిక, డాక్టర్ కె.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.